క్లుప్తంగా

కరాటే పోటీల్లో భీమిలి విద్యార్థుల ప్రతిభ



ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు

భీమునిపట్నం: మండల కేంద్రం భీమిలికి చెందిన షాడో షోటోకాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపారు. విజయనగరంలో జరిగిన ఈ పోటీల్లో కాటా, కుమితి విభాగాల్లో కె.సాయిచరణ్, వై.వినీత్‌రావు, కోటిశివగణేష్, బెన్సన్, బి.చంద్రకౌశిక్‌లు వెండి, కాంస్య పతకాలను సాధించారు, వీరిని చీఫ్ కోచ్ ఎం.వెంకట రమణయాదవ్ అభినందించారు.


మాజీ ప్రధాని నెహ్రూకు ఘన నివాళులు


జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తగరపువలస: మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆదర్శహిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం వద్ద విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ దేశ ప్రధానిగా ఏఐఎం, ఐఐటీ,ఐఐఎం వంటి వాటిని అభివృద్ధి చేసిన ఘనత నెహ్రూదేన్నారు. 1964లో ఆయన మరణించారన్నారు.

ఇద్దరు అదృశ్యం


రాము (ఫైల్)


సూర్యనారాయణ

పీఎం పాలెం: పీఎం పాలెం పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీఎం పాలెం ఆఖరు బస్టాపు నుంచి బాబా కాలేజీకి వెళ్లే రోడ్డులోగల రాజ్యలక్ష్మి నిలయంలో పూతి రాము(40) కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు.అతని భార్య వాచ్‌మన్‌గా పనిచేస్తుండగా, రాము కూలి పనులకు వెళుతుంటాడు. ఈ నెల 22వ తేదీ ఉదయం 8 గంటలకు కూలి పనులకు వెళుతున్నానని ఇంటి నుంచి బయలుదేరిన రాము తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో రాము భార్య సంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

• పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీ అశోక్ నగర్‌లో రమారాయ్ కుంటుంబతో నివసిస్తున్నాడు. తన మామ అయిన మద్ది సూర్యనారాయణ (81)ను ఈనెల 15న శస్త్ర చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్పించాడు. 23వ తేదీన డిశ్చార్జ్ చేసి ఇంటికి తీసుకువచ్చాడు. 24వ తేదీ ఉదయం గదిలోకి వెళ్లి చూడగా సూర్యనారాయణ కనిపించ లేదు. 5.30 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లి పోయినట్టు చుట్టు పక్కల వారి ద్వారా తెలిసిందని, రమారాయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.

నోటి క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

కొమ్మాది: నోటి క్యాన్సర్‌పై అందరూ అప్రమత్తంగా ఉండాలని వైస్ చాన్సలర్ బి.గీతాంజలి తెలిపారు. నో టొబాకో డే సందర్భంగా గీతం దంత కళాశాల ఆధ్వర్యంలో నోటి క్యాన్సర్‌పై వారం రోజుల పాటు నిర్వహించే అవగాహన కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ముందుగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. పొగాకు సంబంధిత ఉత్పత్తుల వినియోగం నోటి ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనీష్ కుమార్, డాక్టర్ ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి దందా

పద్మనాభం మండలం లో అనుమతులు లేకుండా భారీగా తరలింపు


అనంతవరం నుంచి బోనికి మట్టిని తరలిస్తున్న లారీ


శేరిఖండం వద్ద మట్టి లారీని అడ్డుకున్న గ్రామస్తులు

తగరపువలస: పద్మనాభం మండలంలో మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. రాత్రీపగలు తేడాలేకుండా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. నిత్యం పద్మనాభం పోలీస్ స్టేషన్ ముందు నుంచి, తహసీల్దార్ కార్యాలయాన్ని ఆనుకుని మట్టి రవాణా అవుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. రూ.లక్షలు చేతులు మారవడం వల్లే గత ఆరు నెలలుగా ఈ దందా సాగుతున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అనంతవరం, పొట్నూరు, మద్ది తదితర పంచాయతీల్లో మట్టి రవాణాజోరుగా సాగుతోంది. ఎకరాకు నియమిత లోతు తవ్వితీసిన మట్టికి గాను ఇటుక బట్టీల యజమానుల నుంచి రైతులు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలు వసూలు చేస్తున్నారు. చాలా ప్రాంతాల్లో రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండానే మట్టిని తరలిస్తున్నారు.ఇటీవల ఎన్నికల సందర్భంగా పద్మనాభం పోలీసులు ఐదు లారీలను పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించగా పది రోజుల పాటు ఈ లారీలను తహసీల్దార్ కార్యాలయంలో ఉంచారు.

దుమ్ము, ధూళి.. రహదారులకు గుంతలు

ప్రతి రోజూ అనంతవరం, మద్ది పంచాయతీల నుంచి నీళ్లకుండీలు–విజయనగరం రహదారిపైకి, పొట్నూరు–రెడ్డిపల్లి మార్గంలో బోని, పాండ్రంగి వరకు కనీసం 500 లారీల మట్టి రవాణా అవుతోంది. లారీలపై నింపిన మట్టి మీద ఎలాంటి కవర్లు వేయకపోవడంతో వాటి నుంచి దుమ్ము, ధూళి ఎగిరి ఆ రోడ్డులో ప్రయాణించే బస్సులు, ద్విచక్రవాహనాలపై పడుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధిక బరువుతో మట్టి లారీలు ప్రయాణిస్తుండడంతో రోడ్లపై గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ వాహనాలను మితిమీరిన వేగంతో నడుపుతుండడంతో ప్రమాదాలు జరిగితే అవకాశం ఉందని మండల ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.


పద్మనాభం పోలీస్ స్టేషన్ సమీపంలో పెట్రోల్ బంకు వద్ద మట్టి లారీ

లారీలను అడ్డగించిన రెడ్డిపల్లి వాసులు

నిత్యం మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న మట్టి లారీలను రెడ్డిపల్లి వాసులు సోమవారం అడ్డగించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి దందా సాగుతున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు కనీసస్థాయిలో స్పందించడం లేదని వారు మండిపడుతున్నారు. మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు.

> **మైనింగ్ విభాగం అనుమతి ఉండాలి**
>
> సొంత భూముల్లో మట్టి తవ్వుకుని తరలించాలన్నా మైనింగ్ విభాగం అనుమతులు తప్పనిసరి. మండలంలోని మట్టి తవ్వకాలపై మాకు సమాచారం లేదు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటాం.
>
> – ఎస్.వెంకటరావు, తహసీల్దార్, పద్మనాభం

వాగును ఆక్రమించి రోడ్డు నిర్మాణానికి యత్నం


పొక్లెయిన్‌తో చదును చేసిన వాగు ప్రాంతం


అక్రమంగా తొలగించిన తాటి చెట్లు

టీడీపీ నాయకుల నిర్వాకాన్ని అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

భీమునిపట్నం: మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న పెద్ద వాగును ఆక్రమించి, రోడ్డు నిర్మించేందుకు సోమవారం కొందరు టీడీపీ నాయకులు యత్నించారు. వారి ప్రయత్నాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. వివరాలు... భీమిలి నుంచి విశాఖ వెళ్లే మార్గంలోని గొల్లలపాలెం వద్ద సర్వే నంబర్ 45లో రోడ్డుకు ఆనుకుని పెద్ద వాగు ఉంది. వర్షాలు పడే సమయంలో ఇందు లోంచి నీరు ప్రవహిస్తుంది. దీని వెనుక ప్రాంతంలో గల సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమి గతంలో ఆక్రమణలకు గురైంది. ఈ భూమి వద్దకు వెళ్లడానికి మార్గం లేకపోవడంలో కొందరు టీడీపీ నాయకులు ఏకంగా వాగును ఆక్రమించి రోడ్డు వేయాలని భావించారు. పొక్లెయిన్‌తో వాగు ప్రాంతాన్ని చదును చేయించారు. దాని పక్కన ఇరువైపులా ఉన్న తాటి చెట్లను పూర్తిగా నరికివేశారు. సమాచారం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దారు శ్రీనుబాబు.. వీఆర్వో సత్యవేణి, రెవెన్యూ సిబ్బందిని సంఘటన స్థలానికి పంపి, పనులను ఆపించారు. దీనిపై డిప్యూటీ తహసీల్దారు శ్రీనుబాబు మాట్లాడుతూ వాగులు, ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలను తీసుకుంటామని చెప్పారు. వాగును ఆక్రమించేందుకు యత్నించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. గతంలో ఆక్రమణలకు గురైన ఈ వాగు వెనుక గల ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని, మళ్లీ ఈ వాగు ఆక్రమణకు గురికాకుండా చూడాలని స్థానికులు కోరారు.

కొండపై పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు


కాపులదిబ్బడపాలెం కొండపై అనధికార నిర్మాణం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం దరి కాపులదిబ్బడపాలెం కొండపై సర్వే నంబర్ 314 ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇక్కడ టీడీపీకి చెందిన ఓ నాయకుడి అండతో 60 గజాల స్థలాన్ని రూ.5 లక్షల నుంచి రూ.ఆరు లక్షలకువిక్రయాలుజరుపుతున్నారు. దర్జాగా కొండను తొలచి దానిని చదును చేసి ప్లాట్స్‌గా విభజించి అమ్మకాలు నిర్వహిస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. సచివాలయ సమీపంలోనే ఈ అక్రమాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఓ వ్యక్తి కొండ చివరన చదును చేసి ఏకంగా కాలమ్స్‌తోనే నిర్మాణాన్ని చేపడుతున్నారు. తహసీల్దార్ టి. గోవిందను వివరణ కోరగా కొండపై జరుగుతున్న అనధికారిక నిర్మాణంపై పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భీమిలి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆదిమూలం నాగరాజు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంగివలసలో సోమవారం పోలమాంబ యూత్ ఆధ్వర్యంలో భీమిలి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఐపీఎల్ తరహాలో క్రీడాకారులను కొనుగోలు చేసి ఈ క్రికెట్ టోర్నమెంట్ జరుపుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇందులో ఏడు ఫ్రాంచైజ్ జట్లు పాల్గొంటాయన్నారు. వీటికి పోలమాంబ ఫైటర్స్, టీమ్ అవెంజర్స్, బీఆర్ వారియర్స్, హిందూస్థాన్ లెవెన్స్, మార్నింగ్ స్టార్స్, కింగ్స్ ఎలెవెన్స్, స్మాషర్స్ టీమ్‌లుగా నామకరణం చేశారన్నారు. 14 రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతిగా రూ.40వేలు, రెండో బహుమతిగా రూ.20వేలు అందించనున్నట్టు నిర్వాహకులు లోవరాజు, వెంకట్, రఘు తెలిపారు. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆదిమూలం నాగరాజు, అక్కరమాని వెంకటరావు, వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి అమ్మ వార్ల ఉత్సవాలు వాయిదా

మధురవాడ: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే త్రిశక్తి ఆలయంలో అమ్మవార్ల ఉత్సవాలు వాయిదా వేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కొమ్మాది జంక్షన్‌లో త్రిశక్తి ఆలయంలో వెలసి మధురవాడ పరిసర ప్రాంత 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దేవతలు బంగారమ్మ, ఎర్నమ్మ, దుర్గ దండుమారమ్మ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారు. దీంతో పరిసర ప్రాంతాలకు చెందిన పలు కాలనీలు, గ్రామాల ప్రజలు మంగళవారం పసుపుకుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 5గంటల నుంచి అమ్మ వార్లకు మేలుకొలుపు, 6.30 గంటలకు పంచామృత, సుగంధ ద్రవ్యాలు, జలాభిషేకాలు నిర్వహించనున్నారు.

‘గోరుముద్ద’తో పౌష్టికాహారం


మాట్లాడుతున్న ఎండీఎం ఏడీ జ్యోతి


ఎండీఎం కుక్‌లు తయారు చేసిన వంటకాలు

పద్మనాభం: ప్రభుత్వం గోరు ముద్ద పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తోందని ఎండీఎం ఏడీ ఏఏ జ్యోతి అన్నారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఎండీఎం కుక్ కమ్ హెల్పర్లకు రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం గోరు ముద్ద వంటకాల తయారీపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు గోరు ముద్ద ద్వారా రుచికరమైన భోజనం అందిస్తున్నట్టు తెలిపారు. వారంలో ఐదు రోజులు గుడ్లు, మూడు రోజులు రాగి జావా, మూడు రోజులు చిక్కీలు పెడుతున్నట్టు తెలిపారు. ఫోర్టుఫైడ్ రైస్ పెట్టడం వల్ల హార్మోన్ల లోపం లేకుండా విద్యార్థుల ఎదుగుదల బాగుంటుందని తెలిపారు. వంద శాతం విద్యార్థులు పాఠశాలలోనే మధ్యాహ్నం భోజనం చేయాలన్నారు. దీని వల్ల విద్యార్థుల్లో సామాజిక విలువలు పెరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కుక్ కమ్ హెల్పర్లకు వంటకాల తయారీపై పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.సన్యాసిరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల ఉత్సవాలు



తోగాంబికా అమ్మవారు, ముత్యాలమ్మ


గోస్తనీనది వద్ద చిట్టివలస-గుడివాడ వంతెనపై విద్యుత్ దీపాల అలంకరణ

తగరపువలస: చెరకుపల్లి అవంతి కళాశాల నుంచి భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ దివీస్ లేబరేటరీ వరకు అమ్మవార్ల పండగలు సోమవారం తొలేళ్లతో ప్రారంభమయ్యాయి. చిప్పాడ, మూలకుద్దు, పెదనాగమయ్యపాలెం పంచాయతీలకు చెందిన ఆశిపాలెం, సిటీనగర్, నమ్మివానిపాలెం, పాతపాలెం, జీరుపాలెం, కంచేరుపాలెం గ్రామాల ప్రజలు సుత్తమ్మ అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ గ్రామాల్లో అమ్మవారికి మంగళవారం రథోత్సవం, పాలధార, బుధవారం అనుపోత్సవం నిర్వహించనున్నారు. గుడివాడ, ఎరుసుపేట, పాత చెరకుపల్లి తదితర గ్రామాల ప్రజలు తోగాంబికా అమ్మవారికి మంగళవారం రథోత్సవం, పాలధార, అనుపోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చెరకుపల్లి నుంచి దివీస్ వరకు పండగ కళ సంతరించుకుంది. గ్రామాలన్నీ బంధువులతో కళకళలాడుతున్నాయి. విద్యుత్ దీపాలను భారీ ఎత్తున అలంకరించారు. ఆయా గ్రామాలలో ముందస్తు చర్యల్లో భాగంగా భీమిలి, భోగాపురం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున స్టేజ్ ప్రదర్శనలు, బాణసంచాకు అనుమతి ఇవ్వలేదు.

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో గ్రామ దేవతల ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. కృష్ణాపురంలో దుర్గాలమ్మ, బాందేవపురం పంచాయతీ విజయరాంపురంలో బంగారమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మ వారి ప్రతిరూపాలైన ఘటాలను గ్రామాల్లో ఊరేగించారు. ఆలయాలు, ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చురుగ్గా దివ్యాంగ బాలల సర్వే

- 16మంది గుర్తింపు
- ఎంఈవో రవీంద్రబాబు


దివ్యాంగ విద్యార్థిని భవిత కేంద్రంలో చేర్పిస్తున్న ఎంఈవో రవీంద్రబాబు

మధురవాడ: బడి బయట ఉన్న విద్యార్థులతో పాటు దివ్యాంగ బాలల సర్వేను చురుగ్గా నిర్వహిస్తున్నట్టు విశాఖ రూరల్ మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రవీంద్రబాబు చెప్పారు. ఇలా గుర్తించే వారిని బడి లేదా భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆరిలోవ, నేతాజీనగర్, మధురవాడలలో బడి బయట ఉన్న దివ్యాంగులను గుర్తించి బడిలో చేర్పించే కార్యక్రమాలను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 1వ తేదీ నుంచి జూన్ 9 వరకు దివ్యాంగుల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 18ఏళ్ల లోపు దివ్యాంగులను బడిలో చేర్పించే కార్యక్రమం సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో జరుగుతున్నట్టు తెలిపారు. భవిత కేంద్రాల ద్వారా విద్య అందించడంతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న సుదుపాయాలు, ఫిజియోథెరపీ సేవలు, ఉపకార వేతనాలు, రాయితీలు అందిస్తున్నట్టు వివరించారు. ఇప్పటి వరకు 16 మంది దివ్యాంగులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించినట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో భవిత కేంద్రం శిక్షకులు ఎస్.మహాలక్ష్మి, ఎస్‌కే సలీమా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కర సేవకుల కవాతు


కవాతు నిర్వహిస్తున్న కర సేవకులు

మధురవాడ: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) కర సేవకుల కవాతు, బ్యాండు విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఏపీ శాఖ ఆధ్వర్యంలో గుడిలోవ విజ్ఞాన విహార్‌లో నిర్వహిస్తున్న ప్రథమ వర్గ శిక్షా వర్గలో భాగంగా పీఎంపాలెం సాంకేతిక కళాశాల మైదానం నుంచి బక్కన్నపాలెం సాయిగార్డెన్‌లోని సెయింట్ అన్స్ స్కూలు వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్త శ్రీధర్ మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన యువకులు దేశం కోసం, ధర్మం కోసం నిస్వార్థంగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ అధ్యక్షుడు, క్షేత్ర సహ సంఘ్ చాలక్ డి.రామకృష్ణ, ప్రాంత సంఘ్ చాలక్ హరికుమార్ రెడ్డి, సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


సంగివలసలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధానందుని శిష్యులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంగివలసలో సోమవారం భగవద్గీత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు వి.సురేష్, బి.అప్పలనాయుడు, కె.లక్ష్మి, సంతోష్‌లక్ష్మి, టి.మంగమ్మ, బంగారుతల్లి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి విస్తృత ఏర్పాట్లు


చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం ఆవరణలో 24 అడుగుల పంచముఖ ఆంజనేయుడు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయ ఆవరణలో వచ్చేనెల ఒకటో తేదీన హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం 24 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహానికి తుది మెరుగులు దిద్దారు. జయంతి వేడుకల్లో భాగంగా స్వామికి సింధూర, క్షీరామృత అభిషేకాలు, సహస్రనామ అర్చన, రామగాయత్రీ హోమం నిర్వహించనున్నారు. భక్తులకు ప్రసాదాల పంపిణీ, ఊరేగింపు ఉత్సవం నిర్వహించనున్నట్టు అర్చకులు ఆకెళ్ల భాగ్యరాజు శర్మ, రవిగణేష్ శర్మ తెలిపారు.

సజావుగా కౌంటింగ్ జరిగేలా సహకరించాలి


మాట్లాడుతున్న విశాఖ నార్త్ ఏసీపీ సునీల్

పీఎం పాలెం: ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా అందరూ సహకరించాలని విశాఖ నార్త్ ఏసీపీ బి.సునీల్ కోరారు. స్థానిక వైజాగ్ కన్వెన్షన్ హాలులో భీమిలి నియోజకవర్గం పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల లెక్కింపు జరిగిన తరువాత మరుసటి రోజు వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని చెప్పారు. అంతవరకూ రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చడం, కేక్ కటింగ్‌లు, ర్యాలీలు వంటివి నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక లా అండ్ ఆర్డర్ సీఐ వై.రామకృష్ణ, పలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


హాజరైన రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు

విద్యుత్ షాక్‌తో బాలునికి గాయాలు

మధురవాడ: ఆటలాడుకునే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిన ఓ బాలుడు విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం ఆనంద్ క్యాస్టల్ అపార్ట్‌మెంట్‌లో ఆడుకునే క్రమంలో ఎం.గిరిచరణ్(15) అపార్ట్‌మెంట్ ఆవరణలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ఓ ట్రాన్స్‌ఫార్మర్‌కి చెందిన వైరు కాలుకి తగలడంతో గాయాలయ్యాయి. చికిత్స కోసం మొదట ప్రథమ ఆస్పత్రికి, తర్వాత ఉన్నత వైద్యం కోసం గాయత్రి మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. సంఘటన స్థలాన్ని మధురవాడ విద్యుత్ శాఖ ఏఈఈ రామమూర్తి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మధురవాడ: గుర్తుతెలియని కారు ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిథిలాపురి ఉడా కాలనీ శివాలయం సమీపంలోని శ్రీకనక మహాలక్ష్మి నిలయంలో మీసాల వెంకటరావు(57)కుటుంబంతో సహా నివాసం ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం 7.30 గంటల సమయంలో విధులుముగించుకుని ఉడాకాలనీకి నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని తెల్ల రంగు కారు ఢీ కొని ఆగకుండా వెళ్లిపోయింది. గాయపడిన వెంకటరావును కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.